సాక్షి ఒడిశా

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,68,957
బంగారం	1 గ్రాము 150 మిల్లీ గ్రాములు
వెండి	27 గ్రాముల 100 మిల్లీ గ్రాములు


– భువనేశ్వర్/పూరీ



పాఠశాలల్లో వాటర్ బెల్

పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నీటి గంట (వాటర్ బెల్) విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

- IIలో▸



న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్, పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఏడీఎం లోగ్నజిత్

జయపురం: మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల కోసం కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లు, పోలింగ్ కేంద్రాలను కొరాపుట్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్(ఏడీఎం) లోగ్నజిత్ రాత్ గురువారం పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని పాయిక సాహి పాఠశాలలో పోలింగ్ కేంద్రం, జేఈఎల్‌సీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం, జయనగర్ సేవాశ్రమ పాఠశాలలో ఏర్పాటు కానున్న పోలింగ్ కేంద్రాలతో పాటు స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో ఏర్పాట్లను సమీక్షించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో తాగు నీటి వ్యవస్థ, విద్యుత్ సౌకర్యం, వికలాంగ ఓటర్లకు తగిన ఏర్పాట్లుకు తీసుకుంటున్న చర్యలపై అధికారులతో చర్చించారు. ఆయనతో పాటు కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, జయపురం బీడీవో శక్తి మహాపాత్రో, తహసీల్దార్ మనోలిశ ఆచార్య, మున్సిపాలిటీ జూనియర్ ఇంజినీర్ అజయ జాని తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘం సభ్యులు

బరంపురం: జిల్లా కోర్టు ప్రాంగణంలో గంజాం బార్ న్యాయవాదుల సంఘం కార్యాలయంలో బార్ న్యాయవాదుల సంఘం సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు నయన్ చంద్ర మహాపాత్రో, ఉపాధ్యక్షుడు రామ్ ప్రసాద్ పండా, కార్యదర్శి బిరంజి నారాయణ మహాపాత్రో, సహాయ కార్యదర్శి గిరిజ శంకర్ బెహరాలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నయన్ చంద్ర మహాపాత్రో మాట్లాడుతూ బరంపురంలో హైకోర్టు స్థాయి బెంచ్ స్థాపన కోసం గత కొంతకాలంగా బార్ న్యాయవాదుల సంఘం చేపట్టిన ఆందోళన మరింత జోరుగా చేపడతామని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

'బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్ అమలు చేయాలి'



మెమోరాండం సమర్పిస్తున్న కార్మిక నేతలు

జయపురం: ఈనెల 15వ తేదీలోగా బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్ అమలు చేయాలని జయపురం సేవా పేపరు మిల్లు కార్మికులు బుధవారం మిల్లు యాజమాన్యానికి అల్టిమేటం జారీ చేశారు. ఈ మేరకు కార్మిక సంఘ నేతలు మిల్లు ప్రధాన అధికారి సతనామ్ సింగ్‌పాల్‌కు మెమోరాండం సమర్పించారు. బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్ అమలు చేయడంతో పాటు గత 5 నెలలుగా కార్మికులకు బకాయిపడిన వేతనాలను వెంటనే చెల్లించాలని, లేకపోతే మిల్లు గేట్లు బంద్ చేసి సామూహికంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మార్చి 31వ తేదీ నాటికి మిల్లు పొల్యూషన్ సర్టిఫికేట్ రెన్యూవల్ చేయకపోవడంతో మిల్లు ఉత్పాదన పూర్తిగా నిలిచిపోయిందని తెలియజేశారు. కార్మికులకు గత నవంబర్ నుంచి జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. మదర్ అర్థ కంపెనీ పేరుతో రుణం తీసుకొచ్చిన మిల్లు యాజమాన్యం 2018 నుంచి కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు నేటి వరకు చెల్లించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఎన్‌వోసీ బలంతో మిల్లు యాజమాన్యం 250 ఎకరాల భూమి ఆక్రమించడంలో విజయం సాధించిందని, అయితే మిల్లు నడుస్తున్నదీ లేనిదీ, కార్మికుల జీతాలు, బకాయలు చెల్లిస్తున్నదీ లేనిదీ ప్రభుత్వం తెలుసుకోవడం లేదని ఆరోపించారు. ఈ మధ్యకాలంలో 35 మందికి పైగా కార్మికులు మరణించారని, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నా అటు ప్రభుత్వం గానీ, ఇటు మిల్లు యాజమాన్యం గానీ పట్టించుకోవడంలేదని కార్మికులు దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మెమోరాండం ఇచ్చినవారిలో కార్మిక నేతలు ప్రమోద్ కుమార్ మహంతి, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న, దేబాశిష్ సామంత్రాయ్, సుభాశిష్ ఖుంటియా, అశ్విని వైష్ణవ్

భువనేశ్వర్: రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురు అభ్యర్థులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో బీజేడీ మద్దతుతో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన అశ్వినీ వైష్ణవ్, బిజు జనతా దళ్ అభ్యర్థులు దేబాశిష్ సామంత్రాయ్, సుభాశిష్ ఖుంటియాలు ఉన్నారు. న్యూఢిల్లీలోని కొత్త పార్లమెంట్ భవనంలో భారత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ ఈ ముగ్గురితో ప్రమాణం చేయించారు. అశ్వినీ వైష్ణవ్, శుభాశిష్ ఖుటియా ఇద్దరూ మాతృభాష ఒడియాలో ప్రమాణం చేశారు. అశ్విని వైష్ణవ్ వరుసగా 2వ సారి రాజ్యసభకు ఎన్నికవ్వడం విశేషం. తొలి విడతలో ఆయన రైల్వే శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. బారాబటి – కటక్ మాజీ ఎమ్మెల్యే దేబాశిష్ సామంత్రాయ్, సుభాశిష్ ఖుంటియా వీరిరువురు తొలిసారి రాజ్య సభకు ఎన్నికయ్యారు. దేబాశిష్ సామంత్రాయ్ 2014, 2009లో ఎమ్మెల్యేగా గెలిపొందారు. పలు ప్రాంతాల నుంచి రాజ్యసభకు ఎన్నికైన మొత్తం 14 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ అభ్యర్థి అశ్విని వైష్ణవ్, బీజేడీ ఎంపీలు ప్రశాంత నందా, అమర్ పట్నాయక్ పదవీకాలం పూర్తి కావడంతో ఎగువ సభలో ఒడిశా నుంచి మూడు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఆయా స్థానాల్లో మరలా వీరు ఎన్నికయ్యారు.

'సువిధ'పై సమావేశం



త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణ పురస్కరించుకుని ఖుర్ధా జిల్లా రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారుల సమావేశం గురువారం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో విడుదల చేసిన సువిధ యాప్ వినియోగం, పోటీలో ఉన్న అభ్యర్థుల నేర పూర్వాపరాల ప్రచారంపై నవీకరించబడిన మార్గదర్శకాలు తెలియజేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నిబంధనల కార్యాచరణకు సంబంధించి ఈ సమావేశంలో చర్చించారు.

– భువనేశ్వర్

నిర్లక్ష్యానికి భారీ మూల్యం..!

- విద్యార్థికి రూ.5 లక్షల పరిహారం
- సంబల్‌పూర్ వర్సిటీకి హైకోర్టు ఆదేశం



భువనేశ్వర్: పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటనపై నిర్లక్ష్యానికి సంబలపూర్ విశ్వ విద్యాలయం భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. 12 ఏళ్ల క్రితం బ్యాచిలర్ ఇన్ కామర్స్ (బీకాం) కోర్సులో ఒక విద్యార్థి ఫెయిల్ అయినట్లు తప్పుగా ప్రకటించారు. ఈ తప్పిదంతో సంబంధిత విద్యార్థి ఉజ్వల భవిష్యత్ తీవ్రంగా ప్రభావితమైంది. ఈ నేపథ్యంలో బాధిత విద్యార్థికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని సంబల్‌పూర్ యూనివర్సిటీని ఒరిస్సా హైకోర్టు ఆదేశించింది.

వర్సిటీలకు బాధ్యత అవసరం

ఈ కేసు విచారణ పురస్కరించుకుని జస్టిస్ ఎస్.కె.పాణిగ్రాహి ఏక సభ్య ధర్మాసనం పరీక్ష ప్రక్రియలో విశ్వ విద్యాలయాల బాధ్యతను నొక్కి చెప్పింది. విశ్వవిద్యాలయాలు తమ విద్యార్థులపై కీలకమైన బాధ్యతను కలిగి ఉంటాయన్నారు. ముఖ్యంగా పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడం పాటు ఫలితాలను సకాలంలో తప్పులు లేకుండా ప్రకటించడం అవసరమన్నారు. ఈ క్రమంలో ఏదైనా లోపం జరిగితే విద్యార్థి భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలు ఈ బాధ్యతల్లో విఫలమైతే, బాధిత విద్యార్థులకు నష్ట పరిహారం చెల్లించాల్సిందేనని బాధిత విద్యార్థి వాదనని న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. ఈ వాదనపై స్పందించిన ధర్మాసనం ఆర్థిక పరిహారం, కోర్సు క్రెడిట్‌లు లేదా అసౌకర్యాన్ని గుర్తించి సరిదిద్దే చర్యలకు పరిమితం కాకుండా, విద్యాసంస్థల జవాబుదారీతనాన్ని నొక్కి చెప్పినట్లు పరిగణించాలని తెలిపారు.

ఇదీ విషయం...

విద్యార్థి బిభూతి భూషణ్ బారిక్ బీకాం కోర్సులో ఉత్తీర్ణత సాధించినట్లు వర్సిటీ ధ్రువీకరించిన తర్వాత కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. అతను 1999లో బర్‌గడ్ పంచాయతీ కళాశాల పరీక్షా కేంద్రం ద్వారా పరీక్షకు హాజరైనప్పుడు మొదటి సెమిస్టర్ పరీక్ష క్లియర్ కానందున తుది ఫలితాల ప్రకటన నిలిపివేసింది. తదుపరి పరిశీలనలో సుమారు 3 ఏళ్ల తర్వాత 2012 మే 17న కోర్సును విజయవంతంగా పూర్తి చేసి, ఉత్తీర్ణత సాధించినట్లు విశ్వ విద్యాలయం ప్రకటించింది. దీంతో తన జీవితంలోని విలువైన సంవత్సరాలను కోల్పోయినందుకు సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం నుంచి పరిహారం కోరుతూ బిభూతి భూషణ్ బారిక్ 2015లో హైకోర్టును ఆశ్రయించారు. తదనుగుణంగా జస్టిస్ ఎస్.కె.పాణిగ్రాహి సమగ్ర పరిస్థితిని, బాధిత పిటిషనర్ గణనీయమైన కష్టాలను చవిచూశారని, అతని వృత్తి జీవితంలో 10 సంవత్సరాలను కోల్పోయారని, దీనిని ఏ విధంగానూ భర్తీ చేయలేని నష్టమని సంబలపూర్ విశ్వవిద్యాలయానికి ధర్మాసనం వివరించింది. పరిహారంగా పిటిషనర్‌కు రూ.5 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. ఏది ఏమైనప్పటికీ నష్టపరిహారం కొంత ఉపశమనాన్ని అందించగలిగినప్పటికీ, అది విశ్వవిద్యాలయాలను వారి బాధ్యతల నుంచి విముక్తి చేయదని గమనించడం ముఖ్యమన్నారు. పటిష్టమైన వ్యవస్థలు, క్రమబద్ధమైన ఆడిట్‌లు, విద్యార్థుల సంక్షేమంపై నిబద్ధతతో విశ్వవిద్యాలయాలు అటువంటి లోపాలను ఆదిలోనే నిరోధించడానికి కృషి చేయాలని న్యాయమూర్తి సూచించారు.

ఉగాది వేడుకలకు సమాయత్తం



సభ్యుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 9వ తేదీన జరగనున్న ఉగాది వేడుకలకు సంబంధించి రాజీవీధిలో ఒక ప్రైవేటు హోటల్‌లో సభ్యులంతా మంగళవారం రాత్రి సమావేశమయ్యారు. శ్రీక్రోధి నామ సంవత్సరం సందర్భంగా స్థానిక కరణం వీధిలో నృసింహనాథ్ ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని కార్యదర్శి బర్నాల జగన్నాథరావు, అధ్యక్షుడు బి.ఆనందరావు, కార్యవర్గ సభ్యులంతా నిర్ణయించారు. ఉగాది పంచాంగ శ్రవణం, కవితా పఠనం, కవులకు సన్మానం, సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలియజేశారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించండి'



కలెక్టర్‌ను కలిసిన మహిళలు

రాయగడ: సదరు సమితి కారుబాయి పంచాయతీలోని అర్పణ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్‌కు వినతిపత్రం గురువారం అందజేశారు. వేసవి కాలం కావడంతో గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని 63 కుటుంబాలకు చెందిన సుమారు 400 మంది జనాభా కోసం ప్రభుత్వం 4 గొట్టపు బావులతో పాటు, మరో సోలార్‌తో నడిచే గొట్టపు బావిని ఏర్పాటు చేసిందని తెలియజేశారు. అయితే వాటిలో రెండు గొట్టపు బావులు ఆరు నెలలు క్రితం మరమ్మతులకు గురైనట్లు పేర్కొన్నారు. మరొక గొట్టపు బావి నుంచి బురద నీరు వస్తుండడంతో తాగడానికి పనికిరాకుండా పోతోందని వాపోయారు. సోలార్‌తో నడిచే గొట్టపు బావి గ్రామస్తులకు అవసరమైన నీటిని సమకూర్చలేకపోతోందని వెల్లడించారు. దీంతో చేసేదేమీ లేక వాగులో నీటిని తాగుతున్నట్లు తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు.



వాగు నుంచి నీటిని సేకరిస్తున్న గ్రామస్తులు

బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్ సాహు



చంద్రశేఖర్ సాహు

బరంపురం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేడీ కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ అధిష్టానం బరంపురం లోక్‌సభ మాజీ ఎంపీ చంద్రశేఖర్ సాహుని రాష్ట్ర బీజేడీ ఉపాధ్యక్షుడిగా పదవి అప్పగించింది. దీంతో ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు యోగా ఉత్సవ్

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్ క్రీడా మైదానంలో యోగా ఉత్సవ్ –2024 ప్రోగ్రాం శుక్రవారం నిర్వహించనున్నట్లు అసోసియేట్ ప్రదీప్ కుమార్ సాహు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు జరిగే కార్యక్రమంలో పూరీ నుంచి జగన్నాథ యోగా అకాడమీ సభ్యులు, సెంచూరియన్ యోగా క్లబ్ సభ్యులు పాల్గొంటారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరిగే కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమాలు మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా ఇన్‌స్టిట్యూట్ సహకారంతో జరుగుతాయని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో అసంతృప్తి సెగలు



డీసీసీ అధ్యక్షుడు బిజయ్ గొమాంగోకు రాజీనామా అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు

రాయగడ: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు మంగళవారం అభ్యర్థుల జాబితా విడుదల చేయడంతో గుణుపూర్, బిసంకటక్‌లో అసంతృప్తి సెగలు చెలరేగాయి. గుణుపూర్ నుంచి సత్యజీత్ గొమాంగో, బిసంకటక్ నుంచి నీలమాధవ హికక పేర్లు ఖరారవ్వడంతో ఆ పార్టీలో కొంతమంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు రాజీనామాలు కూడా కొనసాగుతున్నాయి. జిల్లాలోని గుణుపూర్ విధానసభ పరిధి గుణుపూర్, గుడారి, చంద్రపూర్ సమితుల నుంచి కొందరు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గుణుపూర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవినాష్ గొమాంగో, ఉపాధ్యక్షుడు భాస్కర జగరంగ, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నునా బౌరి తదితరులు తమ రాజీనామా పత్రాలను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగోకు బుధవారం అందజేశారు.

నీల మాధవకు టిక్కెట్టు ఖరారు చేయడంతో...

బిసంకటక్ విధానసభ నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున నీలమాధవ హికకకు అధిష్టానం టిక్కెట్టు ఖరారు చేయడంతో టిక్కెట్టు రేసులో ఉండే నీలమాధవ ఉలక వర్గీయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బిసంకటక్ విధానసభ పరిధి కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయిలో బుధవారం కల్యాణ సింగుపూర్, కొలనార, బిసంకటక్, మునిగుడ సమితులకు చెందిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై అసంతృప్తి వ్యక్తం చేశారు. బిసంకటక్ విధానసభ టిక్కెట్టు రేసులో నీలమాధవ ఉలకకు కాదని నీలమాధవ హికక పేరును ప్రతిపాదించి, అందుకు టిక్కెట్టు వచ్చేలా కృషి చేసిన కొరాపుట్ లోక్‌సభ ఎంపీ (సిట్టింగ్) సప్తగిరి శంకర్ ఉలకపై అంతా మండిపడ్డారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఎన్నికల్లో సప్తగిరికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఏదిఏమైనప్పటికీ ఈ రెండు నియోజకవర్గాల్లో నెలకొన్న అసంతృప్తి పార్టీ విజయంపై ఏవిధంగా ప్రభావం చూపుతుందో చూడాలని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

విమానాశ్రయంలో ఎన్నికల స్క్వాడ్ తనిఖీలు

- ఒక వ్యక్తి వద్ద రూ.9 లక్షలు పట్టివేత



విమానాశ్రయంలో ప్రయాణికుడి బ్యాగ్ తనిఖీ చేస్తున్న అధికారులు



డబ్బు పట్టుబడిన తర్వాత విచారిస్తున్న అధికారులు

జయపురం: స్థానిక విమానాశ్రయంలో ఒక ప్రయాణికుడి వద్ద రూ.9 లక్షలను ఎన్నికల స్క్వాడ్ అధికారులు పట్టుకున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. బుధవారం సాయంత్రం భువనేశ్వర్ వెళ్లేందుకు జయపురం విమానాశ్రయంలో వేచివున్న ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేయగా ఒక వ్యక్తి వద్ద రూ.9 లక్షలు బయటపడ్డాయి. ఆ డబ్బు మల్కన్‌గిరిలో ఒక గ్యాస్ ఏజెంట్ యజమాని నుంచి తీసుకొస్తున్నట్లు ప్రయాణికుడు చెప్పాడు. అయితే దానికి గల కారణాలు చూపించకపోవడంతో సీజ్ చేశారు. ఆ డబ్బుని స్థానిక ప్రభుత్వ ట్రెజరీలో జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఆ ప్రయాణికుడిని విడిచిపెట్టే ముందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ముందు హాజరుపరిచి, సదరు రూ.9 లక్షలకు సంబంధించి పూర్తి ఆధారాలతో వివరిస్తే ఆ డబ్బు తిరిగి ఇస్తారని తెలియజేశారు. దాడుల్లో జయపురం ఎన్నికల కమిషన్ ఫ్లయింగ్ స్క్వాడ్ మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, బీడీవో శక్తి మహాపాత్రో, ఏబీడీవో మనోజ్ నాయిక్, సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి, కేంద్ర ప్రభుత్వ ఇన్‌కం టాక్స్ అధికారి జయంతి శతపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సోమేశ్వరరావు

సారవకోట: మండలంలోని బొంతు జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమ్మరిగుంట పంచాయతీ బొంగాడిపేట గ్రామానికి చెందిన సోమేశ్వరరావు తీవ్ర గాయాలపాలయ్యారు. నౌతళ నుంచి సారవకోట వైపు బైక్‌పై వెళ్తుండగా బొంతు సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డుకు బలంగా ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయనను 108 వాహనంలో నరసన్నపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది హరికృష్ణ తెలిపారు.

తాగునీటి గుంతలో పడి ఆవు మృతి

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో తాగునీరు అందించేందుకు రోడ్డు పక్కన తవ్విన తాగునీటి గుంత (ఎయిర్ హోల్)లో పడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన టికేటి ఉమామహేశ్వరావు ఆవును గురువారం మేతకు విడిచి పెట్టారు. గ్రామంలోని మెగా రక్షిత తాగునీటి పథకం నుంచి రోడ్డు పక్కన పైపులైన్లు వేశారు. ఈ పైపులైన్‌కు సంబంధించి ఎయిర్ హోల్‌గా గుంతను తవ్వి సిమ్మెంటుతో కట్టడం కట్టి విడిచిపెట్టారు. దీంతో మేతకు వచ్చిన ఆవు ఎయిర్ హోల్‌లో పడి మృతి చెందిందని బాధితునితో పాటు గ్రామస్తులు చెబుతున్నారు. మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. అధికారులు స్పందించి ఎయిర్ హోల్‌పై మూత వేయాలని కోరుతున్నారు.

'దేవాలయ భూములు ఆక్రమిస్తే సహించబోము'



ఎండోమెంట్ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించిన అధికారులు

కొత్తూరు: జిల్లాలో ఎండోమెంట్‌కు చెందిన భూములను ఆక్రమిస్తే సహించేది లేదని ఎండోమెంట్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ బీవీఆర్ వీవీ ప్రసాద్ పట్నాయిక్ అన్నారు. కొత్తూరు మండలం కల్లెమ్మ రెవెన్యూ గ్రూపులోని 199-1లో ఎండోమెంట్ భూమి ఆక్రమించినట్లు ఫిర్యాదు అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు గురువారం అసిస్టెంట్ కమిషనర్ 199-1 లో ఉన్న భూమిని పరిశీలించారు. కల్లెమ్మ గ్రామ సచివాలయం సర్వే గిరి సర్వే ప్రాప్తికి ఎండో మెంట్ భూమికి సంబంధించి ప్రాథమికంగా సరిహద్దులు నిర్ణయించడంతో పాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 199-1 సర్వే నంబర్‌లో 3.05 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమి మొత్తానికి హద్దులు గుర్తించి ఆక్రమణలకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఈఓ ప్రభాకరరావును ఆదేశించారు.

శ్రీకాకుళంలో ఫ్లాగ్‌మార్చ్



శ్రీకాకుళంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

శ్రీకాకుళం క్రైం: ఎన్నికల నేపథ్యంలో టూటౌన్ సీఐ ఉమా మహేశ్వరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం పట్టణంలోని గొంటి వీధి, కత్తిరివీధి, న్యూకాలనీ, నానుబాలవీధుల్లో కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బందితో గురువారం ఫ్లాగ్‌మార్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని సీఐ కోరారు.

అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జికి బదిలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తికి కె.శ్రీదేవికి బదిలీ అయ్యింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వచ్చాయి. ఈమెను తూర్పుగోదావరి జిల్లా కాకినాడ స్పెషల్ కోర్టు ఫర్ పోక్సోకు న్యాయమూర్తిగా నియమించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నగరంలోని కామరాజమ్మ కాలనీలో నివాసం ఉంటున్న మూకళ్ల కోటేశ్వరరావు (56) గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రూరల్ ఎస్ఐ వాసుదేవరావు ఇచ్చిన వివరాల మేరకు వ్యక్తిగత పనిమీద సింగుపురం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా.. జాతీయ రహదారి వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఒక్కసారిగా ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ముగిసిన చెస్ పోటీలు

స్థానిక గాంధీ కూడలి సమీపంలోని ఉమా మహేశ్వర్ కాంప్లెక్స్‌లో జయపురం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలు ముగిశాయి. కొరాపుట్ జిల్లాలో మొదటిసారిగా నిర్వహించిన ఈ పోటీల్లో కటక్, ఖుర్దా, కేంద్రాపడ, జగత్‌సింగపూర్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, అణుగూల్, కలహండి, బాలాసోర్, కొరాపుట్ జిల్లాల నుంచి 108 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. పోటీల్లో దినేష్ కుమార్ జెన, దుర్గా ప్రసాద్ మిశ్ర, ఆయుస్మాన్ స్వరోలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జయపురం చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.ఉమా మహేశ్వరరావు, కొరాపుట్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ మహంతిలు విజేతలకు బహుమతులను అందజేశారు. టోర్నమెంట్ న్యాయ నిర్ణేతగా భబేష్ మహంతి వ్యవహరించారు. కార్యక్రమంలో జయపురం చెస్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఆర్.సుభాష్ చంద్రరావు, కొరాపుట్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ మహంతి, బలంగీర్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ప్రియబ్రత తదితరులు పాల్గొన్నారు. - జయపురం

పాఠశాలల్లో వాటర్ బెల్



భువనేశ్వర్: పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న చర్యకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నీటి గంట (వాటర్ బెల్) విధానాన్ని ప్రవేశపెట్టింది. తరగతి సమయాల్లో విద్యార్థుల గొంతు ఎండిపోకుండా ఉండేలా ఈ చర్యకు సంకల్పించడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో దీన్ని తప్పనిసరి చేయాలని పాఠశాల మరియు సామూహిక విద్యా శాఖ మండల విద్యాధికారులు (బీఈఓ), జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈఓ)లకు లేఖ రాసింది. విద్యార్థులను నీరు తాగడానికి ప్రేరేపించడం కోసం నీటి గంట విధానం అనుసరిస్తారు. తరగతి వేళల్లో వరుసగా ఉదయం 8.30, 10, 11 గంటలకు నీటి గంట (వాటరు బెల్) 3 సార్లు మోగించాలని తాజా ఉత్తర్వుల పేర్కొన్నాయి. విద్యార్థులు సకాలంలో నీరు తాగేలా ఉపాధ్యాయులు బాధ్యత వహిస్తారు. పాఠశాలకు వచ్చిపోవడంలో విద్యార్థులు గొడుగులు, నెత్తిన టోపీలు ధరించడంపై విద్యార్థులను చైతన్యపరచాలని పాఠశాల వర్గాలకు తెలిపారు. ఈ చర్యతో గొంతు ఎండిపోకుండా వడ దెబ్బ సంబంధిత విపత్తు, వ్యాధులను నివారించడం సాధ్యం అవుతుందని సామూహిక విద్యా శాఖ వివరించింది. వడగాడ్పుల పరిస్థితుల కారణంగా వడదెబ్బ నివారణకు ఎండ సమయంలో నీడ పాటున ఉండేలా స్వీయ ప్రయత్నం చేయాలని వాతావరణ శాఖ ప్రజలను హెచ్చరించింది.

పోలింగ్ రోజున ప్రభుత్వ సెలవు ప్రకటన

పోలింగు తేదీ	పార్లమెంటరీ, శాసనసభ సెగ్మెంట్లు
13.05.2024	కలహండి, నవరంగపూర్, బరంపురం, కొరాపుట్
20.05.2024	బర్‌గడ్, సుందరగడ్, బొలంగీరు, కంధమల్, అస్కా
25.05.2024	సంబలపూర్, కెంజొహర్, ఢెంకనాల్, కటక్, పూరీ, భువనేశ్వర్
01.06.2024	మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకొని ఓటు వేసేందుకు వీలుగా సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ప్రభుత్వ కార్యాలయాలు, కార్యనిర్వాహక మేజిస్ట్రేటు న్యాయ స్థానాలు, బ్యాంకులు తదితర సంస్థలు సిబ్బందికి పోలింగ్ రోజు సెలవు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మే 13 (సోమవారం), 20 (సోమవారం), 25 (శనివారం), జూన్ 1 (శనివారం) కార్యాలయాలు మూతబడతాయి. పార్లమెంటరీ, శాసన సభ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ తేదీలకు అనుగుణంగా సెలవు వర్తిస్తుందని ప్రభుత్వ ఉత్తర్వులు పేర్కొన్నాయి. రాష్ట్రంలో 4 విడతల్లో పోలింగ్ జరుగుతుంది.

• సీఎం నవీన్‌తో భేటీ



బరంపురం లోక్‌సభ అభ్యర్థిగా బీజేడీ అధిష్టానం బగుభక్షి పాత్రోను ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన భువనేశ్వర్‌లో సీఎం నవీన్ పట్నాయక్‌కు గురువారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనతో పాటు బరంపురం ఎంపీ చంద్రశేఖర్, గోపాల్‌పూర్ బీజేడీ అభ్యర్థి విక్రమ్ కుమార్ పండా తదితరులు ఉన్నారు. - బరంపురం

బీజేడీకి షాక్..!



రాజీనామాపై ప్రకటిస్తున్న రామపండా, గోపీలు

బరంపురం: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేడీకి షాక్ తగిలింది. ఆ పార్టీ మాజీ డిప్యూటీ స్పీకర్ రామచంద్ర పండా, రాష్ట్ర కార్యదర్శి టి.గోపీలు పార్టీకి గురువారం రాజీనామా చేశారు. స్థానిక గాంధీ నగర్ మెయిన్ రోడ్డులోని రామ్ చంద్ర పండా నివాసంలో వారు మాట్లాడుతూ.. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతానికి ఏ పార్టీలోనూ చేరడం లేదని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక సంతోషిమాత దేవాలయం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జన్ని సరోజిని అనే స్కూల్ అసిస్టెంట్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నందిగాం మండలం దిమ్మిడిజోల గ్రామంలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సరోజినమ్మ టెక్కలి అయ్యప్పనగర్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం ఆమె తన ద్విచక్రవాహనం పై తన ఇంటి నుంచి అంబేడ్కర్ జంక్షన్ వైపు వెళ్తుండగా సంతోషి మాత దేవాలయం సమీపంలో వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఘనంగా మా భైరవి జాతర



ఆలయం వద్ద భక్తుల తాకిడి



పూజలందుకుంటున్న మా భైరవి అమ్మవారు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి కుడుములగుమ్మ పంచాయతీలో మా భైరవి అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. చైత్రమాసంలో అమ్మవారికి కొబ్బరికాయతో మాత్రమే పూజాలు చేస్తారు. అమ్మవారిని దర్శించుకుంటే కోర్కెలు తీరుతాయని ఇక్కడి ప్రజల నమ్మకం.

నేడు మెహందీ పోటీలు

రాయగడ: జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తేజస్వి హోటల్ గ్రౌండ్‌లో శుక్రవారం సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు మెహందీ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. అదేవిధంగా సాయంత్రం అంత్యాక్షరి పోటీలు కూడా నిర్వహిస్తారు.

బలిమెలలో బలభద్ర మాఝి పర్యటన



బలభద్ర మాఝికి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల ఎన్‌ఏసీలో నవరంగ్‌పూర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బలభద్ర మాఝి పర్యటించారు. ఆయనకు గోపబంద్ వీధిలో పార్టీ కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ మైనార్టీ అధ్యక్షుడు జోషఫ్ ఫిలిప్స్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



ప్లాట్‌ఫారంపై షెల్టర్ ఏర్పాటు



రైల్వేస్టేషన్ ముందరి భాగం



స్టేషన్‌లో ఓవర్ బ్రిడ్జి పనులు



ప్లాట్ ఫారం పనులు జరగుతున్న దృశ్యం

పర్లాకిమిడి: పర్లాఖెముండి నూతన రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనుల్లో భాగంగా స్టేషన్‌లో కౌంటర్, ప్రయాణికులు సేద తీరడానికి వెయిటింగ్ హాల్, ఫ్లాట్‌ఫారం ఎత్తు, టైల్స్ ఫిట్టింగ్, పైలాన్ పనులు 80 శాతం పూర్తయ్యాయి. అలాగే ఓవర్ బ్రిడ్జికి ఫౌండేషన్ పనులు జరుగుతున్నాయి. రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ ఇకపై ప్రతిరోజూ గుణుపురం నుంచి రూర్కెలాకు తిరుగుతుందని స్టేషన్ మాస్టర్ తెలియజేశారు. ఇదివరకు బుధవారం, ఆదివారం పలాస వరకు ఉండేది. అయితే ప్రస్తుతం వారానికి ఏడు రోజులు గుణుపురం నుంచి భుభనేశ్వర్‌కు, రూర్కెలా ప్రయాణికులు వెళ్లడానికి తగు చర్యలు తీసుకున్నారు.

తీరం.. పర్యాటక హారం

- రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో 67 బీచ్‌ల అభివృద్ధి
- ప్రాధాన్యతగా పనులు చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



జిల్లాలో ఉద్దాన ప్రాంతంలో అందమైన బీచ్

అరసవల్లి: జిల్లాలో సువిశాల తీర ప్రాంతానికి పర్యాటక సొబగులు చేకూరుతున్నాయి. రాష్ట్రంలో అత్యంత పొడవైన తీర ప్రాంతమున్న మన జిల్లాలో తీర ప్రాంత అభివృద్ధికి గత ప్రభుత్వాలు ఏ మాత్రం చర్యలు చేపట్టలే దు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాత్రం జిల్లా తీర ప్రాంతాలకు వరాల జల్లు కురిసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో తీర ప్రాంతాల అభివృద్ధికి 2019 లో కేంద్రప్రభుత్వం విడుదల చేసిన కోస్టల్ జోన్ రెగ్యులేషన్ నోటిఫికేషన్‌కు లోబడి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మేరకు జిల్లాలోని పలు బీచ్‌ల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న కళ్లేపల్లి, కళింగపట్నంతో పాటు ఒడిషా సరిహద్దులో ఉన్న బారువ, అక్కుపల్లి శివసాగర్ బీచ్‌ల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఈమేరకు పర్యాటక శాఖ ఓఅండ్ఎం ప్రాతిపదికన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసింది. మొత్తం జిల్లాలో పర్యాటక కౌన్సిల్ నిర్ణయించిన ప్రకారం మొత్తం 67 బీచ్‌లను అభివృద్ధికి గుర్తించిన సంగతి తెలిసిందే. వీటి అభివృద్ధితో తీరప్రాంతాల్లో చేపల ఉత్పత్తి, మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బందులు లేని రీతిలో పర్యావరణ అనుకూల బీచ్‌లను తీర్చిదిద్దే పనిలో ఉన్నారు.

రాష్ట్రంలోనే అత్యధికంగా...

రాష్ట్రంలో బీచ్‌ల అనుకూల ప్రతికూల అంశాలను పరిగణనలోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందం పర్యటించి రాష్ట్రంలో 12 జిల్లాల్లో 363 బీచ్‌లను గత ఏడాదే గుర్తించింది. ఈమేరకు అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలోనే 67 బీచ్‌లను గుర్తించారు. తర్వాత పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 63 బీచ్‌లు, తర్వాత అనకాపల్లి జిల్లాలో 35 బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు నివేదించారు.

జిల్లాలో గుర్తించిన బీచ్‌లు ఇవే... (నియోజకవర్గాల వారీగా)

- **శ్రీకాకుళం:** కుందువానిపేట, గణగళ్లవానిపేట, బలరాంపురం, కళింగపట్నం, శ్రీకూర్మం(మత్స్యలేశం), మొగదాలపాడు, కొమరివానిపేట, బందరువానిపేట, కె.మత్స్యలేశం.
- **ఎచ్చెర్ల:** బడివానిపేట, బుడగట్లపాలెం-1, బుడగట్లపాలెం2, డి.మత్స్యలేశం, రాళ్లపేట, కె.మత్స్యలేశం,శివాజీ దిబ్బలపాలెం, కొత్త దిబ్బలపాలెం, పాత దిబ్బలపాలెం, పోతయ్యపాలెం, అల్లివలస, జీడిపాలెం, కొవ్వాడ, చీకటివానిపేట, దోనిపేట, గురయ్యపేట.
- **నరసన్నపేట:** రాజరామపురం, పెద్దకొవిరిపేట, జోగంపేట, కొత్తరేవు,గొల్లవానిపేట, గుప్పిడిపేట.
- **పలాస:** మంచినీళ్లపేట, డొంకులపాడు, కంబాలరాయుడుపేట, అక్కుపల్లి, గుణుపల్లి, నువ్వలరేవు, హుకుంపేట, తొట్టూరు, దేవునల్తాడ, కొత్తపేట ఎం.గంగువాడ, గడ్డేరు, బేతాళపురం, రట్టి.
- **ఇచ్ఛాపురం:** డొంకూరు, బారువ, రామయ్యపట్నం, ఇసుకలపాలెం, బట్టిగల్లూరు, ఎకువూరు, సీహెచ్ గొల్లగండి, కపాసుకుద్ది, పుక్కళ్లపాలెం, కొత్తపాలెం, చిన్నకర్రివానిపాలెం, పెద్దకర్రివానిపేట, ఇద్దివానిపాలెం, కొత్తకళింగపట్నం (ఒంటూరు), బట్టివానిపాలెం.
- **టెక్కలి:** భావనపాడు, గెద్దలపాడు, ఎం.సున్నాపల్లి, పిట్టవానిపేట, కుందువానిపేట, పాతమేఘవరం, మరువాడ.

క్లుప్తంగా

కారుపై దాడి


దాడిలో ధ్వంసమైన కారు అద్దం

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం కాలనీలో నివాసముంటున్న గొట్టాపు రాము కారుపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బుధవారం రాత్రి తన ఇంటి వద్ద పార్కింగ్ చేసిన కారు అద్దాలను ధ్వంసం చేసినట్లు బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చిన్నశిర్లాం పంచాయతీ వార్డు మెంబర్‌గా ఎన్నికైన రాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారు. ఆయనంటే గిట్టనివారే ఈ పనిచేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

బొండపల్లి: మండలంలోని రోళ్లవాక గ్రామ శివారు మామిడితోటలో జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. పట్టుకున్న ఆరుగురు వ్యక్తుల నుంచి రూ.45,200 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పేకాటరాయుళ్లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

భూసార పరీక్షలపై అవగాహన


ఏకలవ్య పాఠశాలలో భూసార పరీక్షపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం: భూ సార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని వ్యవసాయ శాఖ ఏడీ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. భూ పరిరక్షణ, నేల సారవంతంపై పుస్తకాల్లో చదువుకున్న అంశాలను పెద్దలకు తెలియజేయాలన్నారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలన్నారు. ఎరువుల వినియోగం తగ్గేలా చూడాలన్నారు. భూసార పరీక్షలపై రైతులకు అవగాహన ఉండడం వల్ల లాభాలు వచ్చే పంటలు సాగుచేసేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం షణ్ముఖరావు, కేవీకే శాస్త్రవేత్త శ్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

కొటియా గ్రామాల్లో ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

- ఎన్నికల అధికారి, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్
- డిప్యూటీ సీఎం రాజన్నదొర సూచనల మేరకు కొటియా గ్రామాల్లో ఎన్నికల ఏర్పాట్లపై ఆరా

సాలూరు: ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద కొటియా గ్రూప్ గ్రామాల్లో ప్రశాంతంగా నిర్వహణే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని సాలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ అన్నారు. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఫిర్యాదు మేరకు ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీశామని చెప్పారు. సాలూరులోని చినహరిజనపేట, పెదహరిజనపేటలలో పోలింగ్ కేంద్రాలను ఆయన గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని, రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల విధులపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. సీ విజిల్, ఆన్‌లైన్‌లో వస్తున్న ఫిర్యాదులను పరిశీలిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రచారానికి కనీసం 48 గంటల ముందు సువిధా యాప్‌లో దరఖాస్తు చేసుకుంటే.. నిబంధనలకు అనుగుణంగా అనుమతులు ఇస్తామని చెప్పారు. ప్రకటనలకు సంబంధించి గుర్తింపు పొందిన పార్టీలు కనీసం మూడు రోజుల ముందు, గుర్తింపులేనిపార్టీలు వారం రోజులు ముందుగా ఎమ్‌సీఎమ్‌సీ (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ)కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొటియా గ్రూప్ గ్రామాల ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

ఏపీజీఎల్ఐలో డిజిటల్ సేవలు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా (ఏపీజీఎల్ఐ) నిధుల లావాదేవీలను ఆన్‌లైన్ చేసినట్టు ఆ శాఖ జిల్లా సహాయ సంచాలకులు జి.హైమావతి తెలిపారు. స్థానిక విలేకరులతో ఆమె గురువారం మాట్లాడారు. ఏపీజీఎల్ఐ పాలసీదారుల సౌకర్యార్థం డిజిటల్ సేవలు అందించేందుకు డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొద్దినెలలుగా జరిగిన డిజిటల్ సేవల కసరత్తు రూపకల్పనలోకి వచ్చిందన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఈ సేవలను అమలులోకి తెచ్చామని వివరించారు. 'నిధి' (నిధి.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్) పేరుతో ప్రత్యేక పోర్టల్‌ను క్రియేట్ చేసినట్టు వెల్లడించారు. ఇందులో ప్రతి పాలసీదారుడి వివరాలు, స్వీకరించిన చందాలు, ప్రస్తుతం లోన్ పొందిన వివరాలు అప్‌డేట్ చేసి ఉంటాయన్నారు. ఉద్యోగులు తమ పాలసీ డేటా కచ్చితత్వాన్ని ధ్రువీకరించాల్సి ఉంటుందని, ఏవైనా వ్యత్యాసాలు ఉంటే ఈ నెల 30వ తేదీలోగా సరిదిద్దుకోవచ్చన్నారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తం

- ఎండ బారిన ప్రజలు పడకుండా వైద్యారోగ్యశాఖ చర్యలు


రాకోడు పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఓఆర్ఎస్ కార్నర్ వద్ద మహిళకు ద్రావణం అందిస్తున్న సిబ్బంది


రామభద్రపురం మండలం సోంపురం గ్రామంలో ఉపాధి వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఆశవర్కర్

విజయనగరం ఫోర్ట్: రోజురోజుకూ భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో ఎండ తీవ్రత పెరుగుతోంది. ఎండతీవ్రతకు వడగాడ్పులు తోడవడంతో తాళలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో తిరగడం, ప్రయాణం చేయడం వల్ల వడదెబ్బ బారిన పడే ఆస్కారం ఉంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎక్కువగా వడదెబ్బ బారిన పడతారు. ఈ నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా వైద్య ఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది.

పీహెచ్‌సీల్లో ఓఆర్ఎస్ కార్నర్‌లు

ప్రజల సౌకర్యార్థం జిల్లాలో ఉన్న పీహెచ్‌సీలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ వద్ద వైద్యారోగ్య శాఖ ఓఆర్ఎస్ కార్నర్‌లను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా ఉపాధి వేతనదారులు ఎండలో పనిచేయడం వల్ల డీహైడ్రైషన్‌కు గురవుతారు. వారి కోసం ఆశవర్కర్ల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు. జిల్లాలో 50 పీహెచ్‌సీలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆశవర్కర్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వద్ద కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ఆశవర్కర్ వద్ద 200ప్యాకెట్లు, ఏఎన్ఎం వద్ద 500 ప్యాకెట్లు, ఎంఎల్‌హెచ్‌పీ వద్ద 1000 ప్యాకెట్లు చొప్పున ఉంటాయి. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలకు వచ్చే వారికి ఓఆర్ఎస్ కార్నర్ ద్వారా ద్రావణాన్ని అందిస్తున్నారు.


జామి మండలం వెంకటరాజుపాలెం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఓఆర్ఎస్ ద్రావణం తాగుతున్న మహిళ

వడదెబ్బ లక్షణాలు

- చెమట పట్టక పోవడం
- శరీర ఉష్ణోగ్రత పెరగడం
- వణుకు పుట్టడం
- మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితి ఎండలో బయటకు వెళ్లినప్పుడు ఈ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని వైద్యుడిని సంప్రదించి ప్రాథమిక చికిత్స పొందాలి.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు

- ఎండలోకి వెళ్లేటప్పుడు గొడుగు వాడాలి
- తెలుపురంగు లేదా పలుచని చేనేత వస్త్రాలు ధరించాలి
- తలకు టోపీ గాని రుమాలు కానీ వాడాలి
- వేడిగాలులు తగలకుండా చూసుకోవాలి.
- ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పనిచేయరాదు
- ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఒక గ్లాసు మంచి నీరు తాగాలి
- వీలైనన్ని ఎక్కువ సార్లు మంచి నీళ్ల తాగాలి.
- ఎండలో తిరిగే సమయంలో చల్లని నిమ్మ రసం, కొబ్బరినీరు, మంచి నీరు తీసుకోవాలి

ఓఆర్ఎస్ కార్నర్‌ల ఏర్పాటు



ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేస్తున్నాం. పీహెచ్‌సీలు, విలేజ్‌క్లినిక్‌ల వద్ద ఓఆర్ఎస్ కార్నర్‌లు ఏర్పాటు చేశాం. అలాగే ఉపాధి వేతనదారుల కోసం ఆశవర్కర్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నారు. త్వరలో జనం రద్దీగా ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో కూడా ఓఆర్ఎస్ కార్నర్‌లు ఏర్పాటు చేయనున్నాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

ప్రథమ చికిత్స

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి తీసుకువెళ్లాలి. చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు అలా చేస్తూ ఉండాలి. ఫ్యాన్ గాలి లేదా చల్లని గాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం గానీ ఓఆర్ఎస్ ద్రావణం గానీ తాగించాలి. కోమాలో ఉన్న వ్యక్తికి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలో ఉన్న పీహెచ్‌సీకి తీసుకువెళ్లాలి.

పేదల ఆశాజ్యోతిని మరోసారి గెలిపించండి


ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్ససత్యనారాయణ

- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- చినరవ్యాంలో ఎన్నికల ప్రచార సభ
- పాల్గొన్న ఎంపీ, జెడ్పీ చైర్మన్

మెరకముడిదాం: పేద ప్రజల ఆశాజ్యోతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఆయన ముఖ్యమంత్రి అయితేనే పేద ప్రజలు పట్టెడు అన్నం తింటారని, మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మెరకముడిదాం మండలంలోని చినరవ్యాం గ్రామంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు . ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన సభలో మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో తనకు ఓటు వేసినందుకు మీ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని, ముఖ్యంగా గ్రామానికి అవసరమైన రెండు కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మించుకున్నట్లు చెప్పారు. అలాగే గ్రామానికి తాగునీరు తెచ్చింది తామేనని, ఎన్నికలు పూర్తయిన తరువాత ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పూర్తిగా లేకుండా చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఉన్న పాఠశాలకు నాడు-నేడు పథకంలో జరిగిన అభివృద్ధి చూసి గతంలో పాఠశాల ఎలా ఉండేది? మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాలలో మీ పిల్లలకు ఎలాంటి సౌకర్యాలు అందుతున్నాయో గుర్తించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి అవినీతికి, మధ్యవర్తిత్వానికి తావు లేకుండా అనేక సంక్షేమ పథకాల నగదును నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

అనంతరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎప్పుడో ఎన్నికలు వచ్చినప్పుడు వచ్చి మోసపూరిత మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న తరువాత కనిపించకుండా మాయమయ్యే నాయకులను ఆదరించవద్దు. మీ గ్రామాన్ని మీరు కోరుకునే విధంగా అభివృద్ధి చేసి చూపించిన నాయకుడైన బొత్స సత్యనారాయణను శాసనసభ్యుడిగా, బెల్లాన చంద్రశేఖర్‌కు ఎంపీగా ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బొత్స సత్యనారాయణను, బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపిస్తే రాష్ట్రంలో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకున్న వారమవుతామన్నారు.

సంక్షేమ ఫలాల కోసం జగనన్నే ముఖ్యమంత్రి కావాలి

దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయని అనేక సంక్షేమ ఫలాలను అందించిన ప్రభుత్వం మళ్లీ కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత మనందరిపై ఉందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో మెరకముడిదాం మండలం అభివృద్ధిలో ముందంజలో ఉండడానికి కారణం మంత్రి బొత్స సత్యనారాయణేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ తనయుడు డాక్టర్ బొత్స సందీప్‌బాబు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, స్థానిక నాయకులు కర్రోతు నాగేశ్వరరావు, పల్లె కృష్ణమూర్తినాయుడు, లావేటి సన్యాసినాయుడు, మహేష్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థిగా ప్రచారం


జామిలో మాట్లాడుతున్న గొంపకృష్ణ

జామి: ఇండిపెండెంట్ అభ్యర్థిగా శుక్రవారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు టీడీపీ టికెట్ ఆశించి భంగపడిన గొంపకృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మండలకేంద్రమైన జామిలో శివాలయం, యల్లారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాను ఎస్.కోట అసెంబ్లీ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు వేపాడ మండలంలో ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జామి మండల టీడీపీ అధ్యక్షుడు లగుడు రవికుమార్, కొత్తవలస, వేపాడ, ఎస్.కోట తదితర మండలాలకు చెందిన నేతలు గొరపల్లి శివ, ఇప్పాక త్రివేణి, ఆర్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటల ఏర్పాటుతో భూగర్భ జలాల పెంపు


నీటి కుంటలు పరిశీలిస్తున్న సీఆర్‌డీ జానకీరావు

మక్కువ: పంట పొలాలు, ఉద్యాన తోటల్లో నీటికుంట (ఫారం పాండ్)ల ఏర్పాటుతో భూగర్భ జలాలు పెరుగుతాయని, దీంతో రైతులకు మేలు చేకూరుతుందని సీఆర్డీ సాంకేతిక నిపుణుడు పి. జానకిరావు అన్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని కొయ్యాన పేట గ్రామానికి చెందిన రైతు రెడ్డి గౌరమ్మ పొలంలో గల ఫారంపాండ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. రైతులకు నీటి కంట ల ఆవశ్యకతను సీఆర్డీ జానకిరావు ఈ సందర్భంగా వివరించారు. వేసవిలో పశువుల దాహార్తి నివారించడంతో పాటు, వర్షపు నీటిని నిలువ చేసి, భూగర్భ జలాలను నీటి కుంటలు పెంపొందిస్తాయని చెప్పా రు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీహరి, ఏపీఓ శంబంగి ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



వాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ కార్తీక్

- జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్
- విజయనగరంలో భారీ వాహన ర్యాలీ

విజయనగరం అర్బన్: ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటుహక్కును వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ కోరారు. ఓటు హక్కు వినియోగం పట్ల ప్రజల్లో చైతన్యం పెంచి, శత శాతం ఓటింగ్ నమోదు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా భారీ వాహన ర్యాలీని కలెక్టరేట్ వద్ద ఆయన గురువారం ప్రారంభించారు. ఈ ర్యాలీలో 50 మున్సిపల్ వాహనాలు, 20 ఎండీయూ వాహనాలు పాల్గొన్నాయి. వాహనాలకు బ్యానర్లు కట్టి, మైకుల ద్వారా ప్రజలకు అవగాహన కలిపంచారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, కోట, మూడు లాంతర్లు, గంటస్తంభం మీదుగా ఎన్‌సీసీ వరకు జరిగింది.

ర్యాలీని ప్రారంభించిన అనంతరం జేసీ మాట్లాడుతూ ఓటర్లలో అవగాహన పెంచేందుకు స్వీప్ కార్యక్రమాన్ని రెండు వారాలుగా విస్తృతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా ఇప్పటికే దివ్యాంగులతో ర్యాలీ, 2కే రన్ తదితర కార్యక్రమాలను నిర్వహించామని త్వరలో మహిళల కోసం ప్రత్యేకంగా కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డీఎస్ఓ మధుసూదన రావు, మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, తహసీల్దార్ పీవీరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు సెలవులు

- డీవీఈఓ మంజులా వీణ


డీవీఈఓ మంజులా వీణ

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియట్ కళాశాలలకు ప్రభుతం వేసవి సెలవులు ప్రకటించిందని డీవీఈఓ మంజులా వీణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మే 31 వరకు వేసవి సెలవులు ఉంటాయని, జూన్ 1 నుంచి తిరిగి ఇంటర్మీడియట్ కాలేజీలు పునఃప్రారంభం కానున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశించినట్లు పేర్కొన్నారు. సెలవుల్లో ఎలాంటి క్లాసులు నిర్వహించరాదని, అలాగే షెడ్యూల్ విడుదల కాకపోయినా ప్రవేశాలు నిర్వహిస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నియమాలు ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏకలవ్యలో ప్రవేశానికి గడువు పెంపు


ప్రిన్సిపాల్ ఎర్రునాయుడు

మక్కువ: ఏకలవ్య పాఠశాలలో ఆరవ తరగతిలో విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తుల గడువు పెరిగినట్లు ప్రిన్సిపాల్ బి.ఎర్రునాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అనసభద్ర గ్రామం సమీపంలోని ఏకలవ్య పాఠశాలలోఆరో తరగతి విద్యార్థులు ప్రవేశానికి గత నెల 31 తేదీతో గడువు పూర్తవగా విద్యార్థుల సౌకర్యార్థం ఈనెల 20వ తేదీ వరకు కేంద్రప్రభుత్వం గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మహిళకు గాయాలు

సీతంపేట: పాలకొండ నుంచి సీతంపేట వస్తుండగా కిట్టాలపాడు జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పడంతో బైక్ వెనుక కూర్చున్న సీతంపేటకు చెందిన ఉష జారిపడడంతో గాయాలయ్యాయి. దీంతో ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి, అనంతరంమెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


సత్యనారాయణ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని తారాపురం గ్రామంలో గురువారం ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బెవర సత్యనారాయణ(40) మద్యానికి బానిసై రోజూ తాగుతూ పనిపాటా లేకుండా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆస్తులు అమ్ముకుని తాగుతూ తిరిగితే ఎలా అని భార్య మంగమ్మ, కుటుంబసభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై గ్రామ సమీపంలో గల టీకాలచ్చన్న గుడి వద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడు. గతంలో కూడా ఇలానే భార్య,కుటుంబసభ్యులు మందలించడంతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రాణాలు నిలబడ్డాయి. ఇప్పుడు మళ్లీ ఇలా చేస్తే ఎలా అని మందలించడంతో బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తెల్లవారినప్పటికీ రాకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఎక్కాడా ఆచూకీ తెలియకపోవడంతో మృతుడి బావమరిది అటుగా వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుండగా రెండవ కుమారుడు 7వ తరగతి చదువుతున్నాడు.

ప్రభుత్వ ఉద్యోగి..


దుప్పాటి నేతాజీ (ఫైల్)

భామిని: మండలంలోని గురండికి చెందిన దుప్పాటి నేతాజీ (30) గురువారం శ్రీకాకుళం రిమ్స్‌లో వైద్య సేవలు పొందుతూ మృత్యువాత పడ్డారు. కుటుంబంలో తలెత్తిన ఆస్తి తగాదాలో మనస్తాపానికి గురైన ఆయన పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బత్తిలి ఏఎస్సై కాంతారావు తెలిపారు. మృతుడు నేతాజీ బాపట్ల సబ్ ట్రెజరీలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్నారు. మొదట భామిని మండలంలోని బిల్లుమడ కార్యదర్శిగా ఎంపికై విధులు నిర్వహిస్తుండగా రెండేళ్ల క్రితం జరిగిన గ్రూప్-2పరీక్షలో ఉత్తీర్ణత సాధించి బాపట్ల ట్రెజరీలో ఎస్ఏగా చేరారు.

మూడు రోజుల క్రితం స్వగృహం గురండి వచ్చిన ఆయన ఆస్తి పంపకంలో తేడాలతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగేసి ప్రాణం తీసుకున్నారని కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. మృతునికి భార్య, తల్లిదండ్రులు, సోదరులు ఉన్నారు.

ఐటీఐ కాలనీలో చోరీ

బొబ్బిలి: పట్టణంలోని ఐటీఐ కాలనీలో ఐదు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు. కాలనీకి చెందిన పెద్దాడ నాగేశ్వర రావు ఇంటి పెరడు తలుపులు పగులగొట్టి చొరబడ్డ దొంగలు బీరువా తెరిచి నెక్లెస్, చెవిదుద్దులు, చైన్ ఎత్తుకు పోయారని ఎస్సై తెలిపారు. చోరీ జరిగిన ఇంటిని సీఐ ఎం.నాగేశ్వర రావు, ఎస్సై జి లోవరాజు పరిశీలించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

విజయనగరం క్రైమ్: విజయనగరం, నెల్లిమర్ల రైల్వేస్టేషన్‌ల మధ్యనున్న రైలు పట్టాలపై సుమారు 40 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతుడి శరీరంపై కాఫీరంగు ఫ్యాంట్, సిమెంట్ రంగు కలిగిన షర్ట్ పువ్వుల డిజైన్‌తో ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు శ్రీకాకుళం రైల్వే హెచ్‌సీ ఎస్.మధుసూదనరావు, ఫోన్ నంబర్ 9110305494ను సంప్రదించాలని రైల్వే సిబ్బంది కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గణనాథ (ఫైల్)

జామి: కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న జామి మండలంలోని బలరాంపురం గ్రామానికి చెందిన ఒడిశెల అప్పారావు(57) మనస్తాపంతో రెండు రోజుల క్రితం (మంగళవారం) బ్లీచింగ్ పౌడర్ నీటిలో కలిపి తాగేసి అపార కస్థితికి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య సన్యాసమ్మ కుమారుడు దేముడు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి..

రేగిడి: మండలంలోని ఒప్పంగి గ్రామంలో గురువారం పాముకాటుకు గురై గ్రామానికి చెందిన సాకేటి గణనాథ(47) మృతిచెందాడు. పొలంలో పనిచేస్తుండగా పాముకాటు వేయడంతో సొమ్మశిల్లిపడిపోయాడు. స్థానికులు గుర్తించి ఇంటికి తీసుకొచ్చేలోగానే మృతిచెందాడు. ఆయనకు భార్య పార్వతి, కుమారుడు రాజేంద్ర, కుమార్తె గిరిజ ఉన్నారు.

గాయపడిన వ్యక్తి..

సీతంపేట: మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన బిడ్డిక మహేష్ (30) బుధవారం బైక్ అదుపుతప్పి పడిపోవడంతో గాయాలయ్యాయి. దీంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. బంధువుల ఇంట వివాహానికి చిన్నకంబ గ్రామానికి వెళ్లి తిరిగి సొంత గ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో బైక్ అదుపు చేయలేక వజ్జాయిగూడ జంక్షన్‌లో ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఫిర్యాదు మేరకు హెచ్‌సీ జనార్దనమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..


జానకి మృతదేహం

సీతానగరం: మండలంలోని కొత్తవలస గ్రామంలో కాపురం చక్కదిద్దుకోవాలని తల్లిదండ్రులు మందలించారనే కోపంతో గడ్డిమందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస గ్రామానికి చెందిన కొట్యాడ జానకి(23)ని సాలూరు మండలంలోని దేవుబుచ్చింపేట గ్రామానికి చెందిన కొట్యాడ సీతారామ్‌కు ఇచ్చి పెద్దల సమక్షంలో వివాహం చేశారు. అయితే పుట్టింటికి వచ్చి ఉన్న కూతురిని కాపురం చక్కదిద్దుకోవాలని ఏప్రిల్ 1వ తేదీన తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన జానకి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగేసి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో పొలంనుంచి వచ్చిన కుటుంబసభ్యులు గుర్తించి తక్షణమే పార్వతీపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం సమీపంలో ఉన్న రాగోలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జానకి గురువారం ఉదయం మృతిచెందింది. మృతురాలి తండ్రి రెడ్డి తిరుపతిరావు ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.రాజేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా, మద్యం నిల్వలు ధ్వంసం

సాలూరు: పట్టణ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన సారా, మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు సీఐ వాసునాయుడు తెలిపారు. ఈ మేరకు 42 కేసుల్లో పట్టుకున్న 1200 లీటర్ల సారా, 186 మద్యం సీసాలను ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఏఎస్పీ సమక్షంలో గురువారం పట్టణ శివారులో ధ్వంసం చేసినట్లు చెప్పారు.

26 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్ట్

వంగర: మండల పరిధి మడ్డువలస జంక్షన్ వద్ద బైక్‌పై అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై వై.వి.జనార్దన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆ వ్యక్తి దగ్గర 26 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.


ధ్వంసం చేస్తున్న సారా, మద్యం నిల్వలు